టీజీఐఐసీ నిర్లక్ష్యంతో అమాయకులు బలి!

- పరిశ్రమలకు సేకరించిన భూములను విక్రయిస్తున్న పట్టాదార్లు
- పరిహారం చెల్లించినా తమపేర రిజిస్ట్రేషన్ చేయించుకోని టీజీఐఐసీ
- రికార్డుల్లో ఇంకా పట్టాదార్ల పేర్లు.. మోసపోతున్న ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) నిర్లక్ష్యం కొందరు అమాయకులకు శాపంగా మారుతున్నది. ఏండ్ల క్రితం పరిశ్రమల కోసం సేకరించిన భూములను కూడా టీజీఐఐసీ తన పేర మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో నష్టపరిహారం తీసుకున్న పట్టాదార్లు తమ భూములను అమాయకులకు అంటగడుతున్నారు. భూములు కొనుగోలు చేసినవారు వాస్తవం తెలిసిన తర్వాత లబోదిబోమంటున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు లెక్కలేనన్ని ఉండొచ్చని అధికారులే అంగీకరిస్తున్నారు. పారిశ్రామిక అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి, మౌలిక సదుపాయాలు కల్పించిన అనంతరం పరిశ్రమలకు విక్రయించడం టీజీఐఐసీ బాధ్యత. రైతుల నుంచి సేకరించిన భూములను నష్టపరిహారం చెల్లించిన వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలా చేయడంవల్ల పట్టాదార్లు ఇతరులకు విక్రయించే అవకాశం ఉండదు. అయితే టీజీఐఐసీకి చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలా ప్రాంతాల్లో సేకరించిన భూములు ఇంకా పట్టాదార్ల పేర్లతోనే కొనసాగుతుండటంతో వారు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల కొనుగోలు చేస్తున్న అమాయకులు మోసపోతున్నారు. ఉదాహరణకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో వివిధ సర్వే నంబర్లలో దాదాపు 20 ఏండ్ల క్రితం అప్పటి ఏపీఐఐసీ సుమారు 200 ఎకరాల భూములు సేకరించింది. అందులో పావువంతు భూముల్లోనే పరిశ్రమలు ఏర్పాటు కాగా, మిగిలిన భూములు ఖాళీగానే ఉన్నాయి. భూములు సేకరించినా వాటిని పరిశ్రమల పేరుతో గానీ, ఏపీఐఐసీ పేరుతోగానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు. దీంతో ఇంకా ఆ భూములు పట్టాదార్ల పేరు మీదే ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు వాటిని మళ్లీ ఇతరులకు విక్రయించారు.

చేతులెత్తేసిన టీజీఐఐసీ

సర్వే నంబరు 81 పరిధిలో ఇటువంటి ఘటన ఒకటి తాజాగా వెలుగు చూసింది. 20 ఏండ్ల క్రితం ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఆరు ఎకరాల భూమి ఇప్పటికే నలుగురు చేతులు మారింది. తీరా ఐదో వ్యక్తి దాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, టీజీఐఐసీ పేర రిజిస్టర్ అయినట్టు రికార్డులు చూపుతున్నాయి. దీంతో విక్రయానికి ఉంచిన ఆ నాలుగో వ్యక్తి తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. తాను పట్టాదారు వద్ద భూమి కొనుగోలు చేసినట్టు, తన భూమిని విక్రయించేందుకు ఎన్వోసీ ఇవ్వాలని బాధితుడు టీజీఐఐసీని వేడుకొంటున్నాడు. అధికారులు మాత్రం ఎన్వోసీ ఇచ్చే ఆస్కారం లేదని చేతులెత్తేశారు. ఆ 200 ఎకరాల భూముల్లో ఇలాంటి ఇంకా ఎన్ని ఉన్నాయో తేలాల్సి ఉన్నది.

స్థానికంగా విచారించుకొని కొనుగోలు చేయాలి: టీజీఐఐసీ

పారిశ్రామిక ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేయాలనుకొనేవారు సమగ్రంగా విచారించుకొని, స్థానికులతో మాట్లాడిన తర్వాతే భూములు కొనుగోలు చేయాలని టీజీఐఐసీ అధికారులు సూచిస్తున్నారు. సిబ్బంది కొరత వల్ల తాము సేకరిస్తున్న భూములను వెంటనే టీజీఐఐసీ పేర రిజిస్ట్రేషన్ చేయించుకోలేకపోతున్నామని, దీన్ని ఆసరాగా చేసుకొని పట్టాదార్లు నష్టపరిహారం తీసుకొని కూడా ఇతరులకు విక్రయించుకొంటున్నట్టు తెలిసిందని చెప్తున్నారు. సేకరించిన భూములను టీజీఐఐసీ పేర మ్యూటేషన్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖపై ఉంటుందని, వాళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము చేసేదేమీ లేదని స్పష్టంచేస్తున్నారు. మొత్తంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకులు ఎంతోమంది మోసపోతున్నారు.

అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(జీసీఎంఎంఎఫ్) అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల(7 బిలియన్ డాలర్లు) ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్టు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లు(10 బిలియన్ డాలర్లు)గా నమోదైందని తెలిపింది. 2022-23 ఏడాదికిగాను 72 వేల కోట్లు(9 బిలియన్ డాలర్లు) ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సరికొత్త ప్లాన్

60 రోజుల వ్యాలిడిటీతో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ మరో ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 60 రోజుల కాలపరిమితితో రూ.345 ప్రీపెయిడ్ ప్లాన్‌ను తెచ్చింది. ఈ ప్లాన్ కింద రోజుకు 1జీబీ డాటాతోపాటు అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. 4జీ సేవలు అందించడానికి సిద్ధమతున్న సంస్థకు ఈ నూతన ప్లాన్‌తో కస్టమర్లకు అధిక ప్రయోజనాలు లభించనున్నాయని తెలిపింది. ఇతర టెలికం సంస్థల కంటే బీఎస్ఎన్ఎల్ టారిఫ్‌లు చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఇరు సంస్థల బోర్డులు ఆమోదం తెలిపాయి. ఈ విలీనం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నది. ఈ విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన 100 ఈక్విటీ షేర్లకుగాను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌నకు చెందిన 155 ఈక్విటీ షేర్లు లభించనున్నాయి.

నూతన కార్ల సందడే..సందడి

వచ్చే నెలలో విడుదలకానున్న ఐదు మోడళ్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ప్రస్తుత పండుగ సీజన్‌లో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ సంస్థలు సరికొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇప్పటికే ప్రతి నెలలో అర డజన్‌కు పైగా మోడళ్లను విడుదల చేస్తున్న సంస్థలు..వచ్చే నెలలోనూ ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తూ ఐదు మోడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో కియా, నిస్సాన్, బీవైడీ, మెర్సిడెజ్ బెంజ్‌లు ఉన్నాయి. ఈ వివరాలు..

కియా నుంచి రెండు మోడళ్లు

కొరియాకు చెందిన వాహన సంస్థ కియా.. దేశీయ మార్కెట్లోకి నయా కార్నివాల్‌ను విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 3న మార్కెట్లోకి విడుదల చేస్తున్న ఈ కారు ధర రూ.50 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. 2.2 లీటర్ 4-సిలిండర్ డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు 193 బీహెచ్‌పీల శక్తినివ్వనున్నది. దీంతోపాటు మరో ఈవీ మోడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 99.8 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈవీ 9లో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. కేవలం 24 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జింగ్‌కానున్నది.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్

వచ్చే నెల 4న మ్యాగ్నైట్ ఫెసిలిఫ్ట్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది నిస్సాన్ ఇండియా. దేశీయ మార్కెట్‌తోపాటు ఇతర దేశాలకు అనుగుణంగా లెఫ్ట్-హ్యాండ్ డ్రైవ్ వెర్షన్ కూడా తీసుకురాబోతున్నది.

బీవైడీ ఈమ్యాక్స్ 7

చైనాకు చెందిన ఈవీల తయారీ సంస్థ బీవైడీ మరో మోడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయబోతున్నది. వచ్చే నెల 8న ఈమ్యాక్స్ 7 మోడల్‌ను అందుబాటులోకి తెస్తున్నది. అడాస్ సూట్, ప్రీమియం స్విచ్ గేర్, సాఫ్ట్-టచ్ మెటిరీయల్స్, లగ్జరీ లుక్‌తో తీర్చిదిద్దింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారులో 55.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మోడల్ 420 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మోడల్ 530 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ మోడల్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 14.4 ఇంచుల సెంట్రల్ టచ్‌స్క్రీన్‌తోపాటు 12.3 ఇంచుల ప్యాసింజర్ టచ్‌స్క్రీన్, 4డీ సరౌండింగ్ సౌండ్ సిస్టమ్ కలిగిన ఈ మోడల్‌ను 2.0 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారు చేసింది.

ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లు

ముంబై, సెప్టెంబర్ 28: ఇటీవల మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చిన ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ కూడా ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నది. ఐఫోన్ 16ని కొనుగోలు చేసినవారికి రూ.5 వేల ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చునని తెలిపింది. అలాగే ఈఎంఐ ఆప్షన్‌లో నెలకు రూ.2,497 చెల్లించి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లు డిసెంబర్ 31 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. పాత ఐఫోన్ కలిగివున్నవారు అప్‌గ్రేడ్‌తో ఐఫోన్ 16ని కొనుగోలు చేసిన వారికి క్యాష్‌బ్యాక్‌తోపాటు వడ్డీ రహిత ఈఎంఐని ఎంచుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్ కేవలం ఐఫోన్ 16 ప్రొ మ్యాక్స్, ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్లస్, ఐఫోన్ 16 మోడళ్లకు వర్తించనున్నది. ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లు అప్‌ట్రానిక్స్, యూనికార్న్, క్రోమా, రిలయన్స్, విజయ సేల్స్, సంగీత మొబైల్స్‌లో లభించనున్నది.

రియల్టీ సంస్థలపై రెరా కొరడా

వెయ్యికిపైగా ప్రాజెక్టులపై రూ.35 కోట్ల జరిమానా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై రెరా కొరడా ఝులిపించింది. మార్కెటింగ్ కార్యకలాపాలు, ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ఉక్కుపాదం మోపడానికి రెరా పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో రెరా ఏర్పాటైన గడిచిన ఏడేండ్లలో ఏకంగా వెయ్యికి పైగా ప్రాజెక్టులపై రూ.36 కోట్ల వరకు జరిమానా విధించింది. వీటిలో ఇప్పటికే రూ.15 కోట్లను ఆయా సంస్థలు చెల్లించాయి కూడా. ఎనిమిది కంటే ఎక్కువ ప్లాట్లను విక్రయించిన, 600 గజాలు అంత కంటే ఎక్కువ స్థలంలో నిర్మించి విక్రయాలు చేసినా ప్రాజెక్టులు రెరా పరిధిలోకి వస్తాయి. ఇలాంటి సంస్థలు తప్పకుండా రెరా వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ రెరా వద్ద నమోదు చేసుకోకుండానే విక్రయాలు జరిపితే ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సంస్థలపై ఈ మండలి భారీస్థాయిలో జరిమానా విధిస్తున్నది.

రెరా ఏర్పాటైన తరువాత వివిధ ప్రాజెక్టులకు విధించిన జరిమానాలు

సంవత్సరం	ఫైన్ వేసిన ప్రాజెక్టులు	జరిమానా మొత్తం (రూ.కోట్లలో)
2018-19	335	3.06
2019-20	49	0.79
2020-21	04	0.29
2021-22	03	0.23
2022-23	180	1.70
2023-24	311	26.69
2024-25	131	2.96
మొత్తం	1013	35.72

రెరా నంబర్ లేకుండానే ప్రకటనలు..

రెరా నంబర్ లేకుండానే రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ స్థాయిలో వాణిజ్య ప్రకటనలు జారీ చేసిన సంస్థలపై ఫిర్యాదులు అందడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వాణిజ్య ప్రకటనలపై ఖచ్చితంగా రెరా నంబర్ ఉండాల్సిందేనని షరతు విధించింది. దీంతో తమ ప్రకటనల పక్కన రెరా నంబర్‌ను ఖచ్చితంగా ముద్రిస్తున్నాయి. ప్రీలాంచ్ ఆఫర్లు, ముందస్తుగా ఒప్పందం చేసుకున్న మేరకు ప్లాట్లను అప్పగించకపోవడం, వాటిలో సరైన వసతులు కల్పించకపోయిన ప్రాజెక్టులపై కూడా చర్యలు తీసుకున్నది. ఒక దగ్గర ప్రాజెక్టు నమోదు చేసుకొని..అదే అనుమతితో మరి కొన్ని చోట్ల విక్రయాలు చేస్తున్న ప్రాజెక్టులను గుర్తించడానికి ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కృష్ణా, తుంగభద్ర నదులకు వరద

గద్వాల/అయిజ, సెప్టెంబర్ 28: జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండడంతో జలకళను సంతరించుకున్నది. ఎగువ నుంచి 1,15,000 కూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు 9గేట్లు తెరచి దిగువకు 99,269 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 15,550 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 14,408 క్యూసెక్కులుగా నమోదైంది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 25వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 20వేల క్యూసెక్కులు, నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 35వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 22,240 క్యూసెక్కులుగా నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

గద్వాల, సెప్టెంబర్ 28 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేదాక సీఐటీయూ వారికి అండగా ఉంటూ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి నర్సింహా అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్ కోసం ఛలో లేబర్ కమిషనరేట్ పేరుతో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, గట్టన్న, రాజేశ్, శ్రీనివాస్‌రెడ్డి, లీలావతి, అరుణ, ఈశ్వర్, శాంతిరాజు, రాజశేఖర్, చందరశేఖర్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

పాన్‌గల్, సెప్టెంబర్ 28 : డీసీసీబీ చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టినందుకుగానూ సంతోషం వ్యక్తం చేస్తూ శనివారం మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రెడ్డి సేవాసమితి నాయకులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులైన రైతులకు మేలు జరిగేవిధంగా రుణాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని చేయాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సమితి నాయకులు దేవిరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మేర్వారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్ణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, అచ్చుతారెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణకు నిరాహార దీక్ష

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 28 : మత్తు పదార్థాల నివారణ కోసం ప్రజా అవగాహన కల్పించేందుకు ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. మత్తుకు యువత బానిస కాకూడదనే ఉద్దేశంతో ఈనెల 30న జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఒక రోజు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పనిచేసినవారికే గుర్తింపు

గట్టు, సెప్టెంబర్ 28 : బాధ్యతగా పనిచేసిన వారినే అందరూ కలకాలం గుర్తుంచుకుంటారని మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. చాగదోణ పాఠశాలలో ఉపాధ్యాయురాలు రేచల్ గెర్షోమ్ పదవీ విరమణ ఉత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేచల్, గెర్షోమ్ దంపతులను ఘనంగా సన్మానించి కొనియాడారు.

అలంపూర్‌లో బస్‌డిపో ఏర్పాటు చేయండి

అలంపూర్, సెప్టెంబర్ 28 : ప్రయాణికుల ఇబ్బం దులను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ నియోజకవర్గ కేం ద్రంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని రవాణాశాఖ మం త్రి పొన్నం ప్రభాకర్‌ను అలంపూర్ ఎమ్మెల్యే విజ యుడు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అలంపూర్ ఆంధ్ర ప్రదేశ్ సరిహ ద్దు ప్రాంతం కావడంతో ఇక్కడి నుంచి మారుమూల గ్రామాల ప్రజలు, విద్యార్థులు కర్నూల్ తది తర ప్రాంతా లకు వెళ్తుంటారని, జిల్లా కేంద్రం నుంచి కేవలం కొన్ని సర్వీసులు మాత్రమే వస్తుండడంతో వివిధ గ్రామాల ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే ని యోజకవర్గ కేంద్రంలో బస్‌డిపోనే ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మంత్రికి సూచించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట నరేందర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, రఘురెడ్డితోపాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రవాణా శాఖ మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే విజయుడు

బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర పోస్టర్ విడుదల



పాదయాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల/గద్వాలఅర్బన్, సెప్టెంబర్ 28 : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాపు బాటలో సత్యశోధన పాదయాత్ర పోస్టర్‌ను శనివారం కలెక్టర్ సంతోష్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అదేవిధంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, జ్ఞాన ప్రతిష్ట ఆధ్వర్యంలో బాపుబాటలో సత్యశోధన పాతయాత్ర పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆవిష్కరించారు. విశ్రాంతి జిల్లా విద్యాధికారి విజయ్‌కుమార్, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్‌లు ఉమ్మడి జిల్లాలో అక్టోబర్ 2 నుంచి వచ్చే సంవత్సరం జనవరి 12వ తేదీ వరకు బాపుబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్, నరసింహులు, కాంగ్రెస్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బాబర్, విజయ్ కుమార్, మురళి, కృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి

చిన్నంబావి, సెప్టెంబర్ 28 : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలని ఎంపీడీవో రమణారావు, తాసీల్దార్ ఎండీ ఇక్బాల్ సూచించారు. శనివారం మండలంలోని చిన్నదగడ అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై పోషకాహాకారంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీనివాసులు, సూపర్ వైజర్ ఆసియా, ఆర్ఐ రాముడు, పంచాయతీ కార్యదర్శి మనిగౌడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జీవో 25ను సవరించాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 28 : అసంబద్ధమైన జీవో నెంబర్ 25ను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డులో అధికారులకు ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జీవో 25తో ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు పెట్టడమేనని వారు ఆరోపించారు. డీఎస్సీని ప్రకటించి బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుకు రవిప్రసాద్‌గౌడ్, కృష్ణయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, కార్యకర్తులు శాంతన్న, నారాయణ శివారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకల వెంకటనారాయణ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దలు సమాజానికి చేసిన కృషిని గౌరవించాలి

- *అదనపు కలెక్టర్ నర్సింగరావు*

గద్వాల, సెప్టెంబర్ 28 : నేటి యువతరానికి వివేకం, తెలివితేటలతోపాటు పెద్దలు సమాజానికి చేసిన కృషిని గౌరవించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. శనివారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెద్దల పట్ల నేటి తరం చూపిస్తున్న వ్యవహారశైలిని పరిగణలోకి తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో సమస్యలు చర్చించి వృద్ధుల దినోత్సవం జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో ఆర్డీవో రామచందర్, శ్రీనివాసరావు, మధుసూదన్‌రెడ్డి, వరలక్ష్మీరాజేందర్, సుజాత, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

విద్యార్థులకు జానపదనృత్య పోటీలు

వనపర్తిటౌన్, సెప్టెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో శనివారం జానపద గ్రూప్ నృత్యం, జాతీయ సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలను నిర్వహించినట్లు అకాడమిక్ మానీటరింగ్ అధికారి మహానంది, సైన్స్ అధికారి శ్రీనివాసులు చెప్పారు. జానపద నృత్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రథమ బహుమతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేతేపల్లి విద్యార్థులు ద్వితీయ బహుమతిని పొందగా తృతీయ బహుమతిని రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అదేవిధంగా జాతీయ సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో ప్రథమ బహుమతి మదర్స్ ల్యాబ్ హైస్కూల్ విద్యార్థులు, ద్వితీయ బహుమతి బాలికల ఉన్నత పాఠశాల వనపర్తి విద్యార్థులు, తృతీయ బహుమతిని బాలికల ఉన్నత పాఠశాల గోపాల్‌పేట విద్యార్థులు గెలుపొందినట్లు వారు చెప్పారు.కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జానపద నృత్యాలు, సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నృత్యపోటీల్లో కేతేపల్లి విద్యార్థుల ప్రతిభ

పాన్‌గల్, సెప్టెంబర్ 28 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశిక్షణ పరిశోధన సంస్థ, జనాభా విద్యవిభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్థాయి జానపద నబుత్య పోటీల్లో మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ప్రతిభకనపరిచి జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభకనపరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, రాజమ్మ, అనంతరామిరెడ్డి, రామకృష్ణ, భాస్కర్, శ్రీనివాసులు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు వ్యవహారంలో కీలక మలుపు

- నార్కోటిక్ అధికారుల తనిఖీల్లో కీలక విషయాలు
- గద్వాల, మల్దకల్‌లో 20 మందిపై కేసు
- బడా కల్లు కాంట్రాక్టర్‌తో సహా పలువురు రాజకీయ నాయకులు ఉన్నట్లు ఆరోపణలు
- వారిని కాపాడేందుకు ఓ పెద్ద లీడర్ ప్రయత్నాలు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 28 : జిల్లాలో నార్కోటిక్ అధికారుల బృందాలు శుక్ర, శనివారాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. నియోజకవర్గంలో నిషేధిత మత్తు పదార్థాలను కల్లులో కలిపి సరఫర చేస్తున్నట్లు నార్కోటిక్ అధికారులకు ఫిర్యాదు వెల్లడంతో నార్కోటిక్ అధికారులు స్పందించి నార్కోటిక్ డీఎస్పీ ఇద్దరు, సీఐలు ఇద్దరుతో సహానాలుగు బృందాలుగా ఏర్పాడి గద్వాల నియోజకవర్గంలోని ధరూర్, గట్టు, మల్దకల్, గద్వాల, కేటిదొడ్డి తదితర మండలలోని ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. అందులోభాగంగా గద్వాల, మల్దకల్ మండలం పరిధిలోని ఆయా గ్రామాల్లో కల్లు దుకాణాలపై తనిఖీ చేసి నిషేధిత మత్త పదార్థాలతో కల్లు తయారు చేసే వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకొని లోతుగా విచారణ నిర్వహించినట్లు సమాచారం. వారిని కాపాడేందుకు అధికార పార్టీలో ఓ పెద్ద లీడర్ ప్రయత్నం చేస్తు చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి.నిషేధిత కల్లు వ్యవహారంలో కొంత మందిపై కేసులు నమోదు చేసిన అధికారులు..వారి వివరాలను వెల్లడించడంలో అనుమానాలు రేగుతున్నాయి.నమోదు అయిన కేసును రహస్యంగా ఉంచుతు కేసును నీరు కార్చాలని, నమోదు అయిన కేసు వివరాలను బయటకు వెల్లడించవద్దని ఆ పెద్ద లీడర్ అధికారులకు అదేశించినట్లు జిల్లాలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి.ఈ విషయంపై పోలీస్, అబ్కారీ శాఖ అధికారులను వివరాణ కొరగా...ఇంకా విచారణ కొనసాగుతుంది.త్వరలో కేసుకు సంబంధించిన విషయాలను వెల్లడిస్తామని పేర్కొంటున్నారు.

ఘనంగా ప్రపంచ రేబిస్ దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 28 : ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో శునకాలకు ఉచితంగా రివ్యాస్ వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రేబిస్ వ్యాధిపై, అలాగే శునకాలు కరిస్తే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ దశరథ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు రమేశ్, వెంకటరాజు, అర్పిత, వినయ్ కుమార్, వరలక్ష్మి, అధికారులు రాంచంద్రరెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మాజీ ఎంపీటీసీకి గాయాలు

కొత్తకోట, సెప్టెంబర్ 28 : రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన శనివారం మధ్యాహ్నం కొత్తకోటలో చోటు చేసుకున్నది. కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథరం మేరకు పాలెం తాజా మాజీ ఎంపీటీసీ పెద్ద నర్సన్న ఉదయం గ్రామం నుంచి ఆటోలో కొత్తకోటకు వచ్చి పని ముగించుకొని మధ్యాహ్నం గ్రామానికి వెళ్లేందుకు ఆటో స్టాండ్ వద్దకు రోడ్డు దాటుతుండగా ఆత్మకూర్ నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండ్ లోపలి వెళ్తున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వలన బస్సు పెద్ద నర్సన్నను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంటనే పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్‌కు తరలించారు. పెద్ద నర్సయ్య కుమారుడు మహిబూబ్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ గంధం మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.